క్లుప్తంగా

ఘనంగా బురకాయలంకమ్మ విగ్రహ ప్రతిష్ట



దుండివారిపాలెం(కర్లపాలెం): మండల పరిధిలోని దుండివారిపాలెంలో పుట్టా అయ్యప్పరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో ఆదివారం పుట్టావారి వంశస్తుల ఇలవేల్పు శ్రీ బురకాయలంకమ్మ దేవర విగ్రహ ప్రతిష్ట వైభవంగా జరిగింది. పుట్టా అయ్యప్పరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు పుట్టా సింగారెడ్డి, శ్రీనివాసరెడ్డిల ఆధ్వర్యంలో సుమారు రూ.20 లక్షలతో ఆలయాన్ని నూతనంగా నిర్మించారు. శాంతి హోమాలు నిర్వహించి దేవాలయంలో బురకాయలంకమ్మ దేవర విగ్రహ ప్రతిష్ట కన్నుల పండువగా నిర్వహించారు. పుట్టావారి వంశస్తుల ఆధ్వర్యంలో బురకాయలంకమ్మ పావడి, ఉత్సవ విగ్రహాలు, పూజా సామాన్లను ఆలయంలో ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

పొన్నపల్లిలో విగ్రహ పునఃప్రతిష్ట ఉత్సవాలు



చెరుకుపల్లి: పొన్నపల్లి గ్రామంలో వేంచేసి యున్న శ్రీ సత్య ప్రసూనాంబ సమేత సోమేశ్వర స్వామి దేవస్థానం పునఃప్రతిష్ట ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎంవీఎస్ వర్మ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 24న బుధవారం 10.46 గంటలకు నూతన ఆలయంలో శ్రీ సత్య ప్రసూనాంబ సమేత సోమేశ్వర స్వామివార్ల విగ్రహ ప్రతిష్ట చేయటం జరుగుతుందన్నారు. 20వ తేదీ శనివారం నుంచి 24వ తేదీ బుధవారం వరకు ప్రతి రోజు వేద పండితులు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్వామివార్ల విగ్రహాలను శుద్ధి చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి పొన్నపల్లిలో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వేద పండితులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శివాలయాల అర్చక స్వామి మృతి

భట్టిప్రోలు: భట్టిప్రోలు శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి, శ్రీ గంగా పార్వతీ సమేత విశలేశ్వర స్వామి దేవస్థానాల అనువంశిక అర్చకులు దండిభొట్ల కనకసుందర శర్మ(80) శనివారం రాత్రి మృతి చెందారు. ఈయనకు భార్య, ఇరువురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. దహన సంస్కారాల నిమిత్తం దేవస్థాన నిధులనుంచి రూ.5 వేలు నగదును కుటుంబ సభ్యులకు కార్యనిర్వహణాధికారి దీవి వేంకట అప్పలాచార్యులు అందజేశారు. గత 5దశాబ్దాలుగా భట్టిప్రోలులోని శివాలయాలలో అర్చకులుగా వ్యవహరిస్తున్న శర్మ అందరికీ సుపరిచితులే. ఆయన మృతి చెందిన వార్త తెలుసుకున్న పలువురు కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం వెలిబుచ్చారు.

జూదరుల అరెస్ట్



గుంటూరురూరల్: నివాసాల మధ్యలో పేకాట ఆడుతున్న వారిని నల్లపాడు పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. సీఐ నరేశ్ కుమార్ వివరాల మేరకు..సుబ్బారెడ్డి నగర్ నందు ఓ ఇంట్లో జూదమాడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేసి నలుగుర్ని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.11, 500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించనున్నట్లు సీఐ తెలిపారు.

పట్నంబజార్: పేకాటాడుతున్న పలువురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏటుకూరు రోడ్డులోని లారీ స్టాండ్ వద్ద పేకాటాడుతున్న తొమ్మిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.6,500 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

- నాడు–నేడుతో రూపు మారిన సర్కారు బడులు
- కార్పొరేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి
- సమకూరిన మౌలిక వసతులు
- విద్యార్థులకు మెనూ ప్రకారం అందుతున్న సమతుల పౌష్టికాహారం
- రూ.36 కోట్లతో 172 పాఠశాలలు ఆధునికీకరణ
- గణనీయంగా పెరిగిన విద్యార్థుల సంఖ్య

ఇది కదా.. అభివృద్ధి



రేపల్లె పట్టణంలో 'నాడు-నేడు'లో అభివృద్ధి చెందిన నేతాజీ పురపాలక ప్రాథమికోన్నత పాఠశాల



నిజాంపట్నం మండలం అడవులదీవి ఉన్నత పాఠశాలలో మెరుగైన వసతుల మధ్య విద్యా బోధన



విద్యార్థులు కూర్చోడానికి సమకూరిన రంగు బల్లలు

రేపల్లె రూరల్: విద్యారంగంలో నూతన ఒరవడిని తీసుకువచ్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంస్కరణలు విజయవంతం అయ్యాయి. నాడు–నేడు పథకంతో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారటంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని గ్రహించిన సీఎం జగనన్న సాధారణ, పేద, మధ్య తరగతి విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగు పరిచేందుకు కార్పొరేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారు. కార్పొరేటు, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా కళ్లు మిరిమిట్లు గొలిపేలా పేద విద్యార్థుల్లో ఆనందం నిండేలా ప్రభుత్వ పాఠశాలల భవనాలు రూపుదిద్దుకున్నాయి.

పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తూ కోట్ల రూపాయలతో భవన నిర్మాణాలు జరిగాయి. ఇంకా జరుగుతున్నాయి. రేపల్లె నియోజకవర్గంలో 436 పాఠశాలలకు గానూ ఫేజ్–1, ఫేజ్–2లలో రెండు విడతలుగా రూ.36 కోట్ల వ్యయంతో 172 పాఠశాలలను అభివృద్ధి చేశారు.

పాఠశాలలకు సమకూరిన వసతులు

తరగతి గదులలో విద్యార్థులు కూర్చునేందుకు రంగు రంగుల బల్లలు ఏర్పాటు చేశారు. చదువుకునేందుకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగ్‌లు, సమరూప దుస్తులు, బూట్లు, సాక్స్, బెల్ట్, డిక్షనరీ అందించటంతో పాటు ఇటీవల 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు సైతం అందించారు. ఇక విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ప్రభుత్వ నిర్దేశిత మెనూతో ఆహారాన్ని అందిస్తున్నారు. కోడి గుడ్లు, చిక్కీలు, రాగిజావ సైతం అందిస్తూ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

నాణ్యత ప్రమాణాలతో విద్యా బోధన

ఆయా పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించి విద్యా బోధనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు, ఉన్నత పాఠశాలల్లో ప్రొజెక్టర్ల ద్వారా విద్యా బోధన, బైజూస్ కంటెంట్ విద్యను అందజేసేందుకు ట్యాబ్‌లు అందజేస్తున్నారు.

మరుగుదొడ్ల అవస్థలకు చెక్

గత టీడీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ అంతంత మాత్రంగా ఉండేది. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు లేకపోవటంతో విద్యార్థులు ముఖ్యంగా బాలికలు పడరాని పాట్లు పడ్డారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని రేపల్లె నియోజకవర్గం బేతపూడి గ్రామంలో ఎమ్మెల్యే సత్యప్రసాద్, అప్పటి జిల్లా కలెక్టర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించబడిన ఓ బహిరంగ కార్యక్రమంలో బాలికలు మరుగుదొడ్డికి వెళ్లాలంటే పడరాని పాట్లు పడుతున్నారని ఇళ్లకు వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయని ఓ తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. నేడు ఆ పరిస్థితులను రూపు మాపుతూ విద్యార్థినీ విద్యార్థులకు వేర్వేరుగా అత్యాధునిక సదుపాయాలతో ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరుగుదొడ్లు నిర్మించటం పట్ల ఆ సమస్యకు చెక్ పడింది. ఉపాధ్యాయులకు సైతం ప్రత్యేక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. పాఠశాలలు అభివృద్ధి చెంది వసతులు సమకూరటంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వివిధ పథకాల ద్వారా రూ.112.6 కోట్లు జమ

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందనటానికి నిదర్శనం రేపల్లె నియోజకవర్గానికి వివిధ పథకాల రూపంలో రూ.112.6 కోట్లు ఖర్చు చేయటం నిదర్శనంగా నిలుస్తోంది. నియోజకవర్గంలో 472 పాఠశాలలు ఉండగా 754 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. 2018–19 విద్యా సంవత్సరం వరకు 28,163 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతుండగా ప్రస్తుతం విద్యా వ్యవస్థలో వచ్చిన మార్పులతో ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2023–24 విద్యా సంవత్సరంలో 30,599 మంది విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. గతంలో పోల్చితే 2,436 మంది విద్యార్థులు అదనంగా పెరిగారు. అదేవిధంగా జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా నియోజకవర్గంలో 32,805 మంది లబ్ధిదారులకు రూ.86.83 కోట్లు, జగనన్న విద్యా దీవెన ద్వారా 24,620 మంది లబ్ధిదారులకు రూ.3.80 కోట్లు, జగనన్న వసతి దీవెన ద్వారా 18,204 మంది లబ్ధిదారులకు రూ.18.86 కోట్లు, జగనన్న విద్యా కానుక ద్వారా 30,559 మంది లబ్ధిదారులకు రూ.3.11కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాలలో ప్రభుత్వం జమ చేసింది. అదేవిధంగా జగనన్న గోరుముద్ద పథకం ద్వారా 8,996 మంది విద్యార్థులకు పౌష్టికాహారం నిమిత్తం ప్రభుత్వం రూ.17.69 కోట్లను ఖర్చు చేసి విద్యాభివృద్ధికి చేయూత నిచ్చింది.

కార్పొరేటు పాఠశాలలకు దీటుగా అభివృద్ధి



ప్రస్తుతం ప్రభుత్వ బడులు చూస్తుంటే నమ్మశక్యంగా లేదు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం పేదల బడులపై ప్రత్యేక శ్రద్ధ చూపటం ఆనందంగా ఉంది. మా అబ్బాయి గుళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూలులో 7వ తరగతి చదువుతున్నాడు. కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చెందిన గుళ్లపల్లి హైస్కూలుకు మా అబ్బాయిని పంపటం ఆనందంగా ఉంది. ఇంగ్లీషులో అనర్గళంగా మాట్లాడుతుండటంతో గర్వంగా ఉంది. ప్రభుత్వ బడులను అభివృద్ధి చేసిన జగనన్నకు కృతజ్ఞతలు.

– వీసం శ్రీనివాసరావు, గుళ్లపల్లి, చెరుకుపల్లి మండలం.

జగనన్నకు అండగా నిలుస్తాం



ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయటంతో పాటు పిల్లలను బడికి పంపే తల్లులకు అమ్మ ఒడి ద్వారా ప్రభుత్వం సాయం అందించటం బాగుంది. నా కుమారుడిని ప్రభుత్వ పాఠశాలకే పంపుతున్నాను. ప్రతి ఏటా అమ్మ ఒడి నగదు నా బ్యాంక్ ఖాతాలో జమ కావటంతో పాటు నా కుమారుడు స్కూలుకు అవసరమైన యూనిఫామ్‌లు, పుస్తకాలు ప్రభుత్వమే అందిస్తోంది. మధ్యాహ్న భోజనం బాగుంటుందని నా కుమారుడు తరచూ చెబుతుంటాడు. పేదల బడులు మార్చిన జగనన్నకు అండగా ఉంటాం.

– సంధ్య, బట్టువారిపాలెం, నగరం మండలం.

మా బడి చాలా బాగుంది



మా బడి చాలా బాగుంది. గతంలో కింద కూర్చుని చదువుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు క్లాసులో విద్యార్థులంతా బల్లలపై కూర్చుని చదువుకుంటున్నాం. అందరం ఒకే రకంగా యూనిఫాం ధరించి పాఠశాలకు వెళ్లటం చాలా బాగుంది. స్కూలులో త్రాగేందుకు పరిశుభ్రమైన నీరు లభిస్తోంది. పాఠశాలకు రన్నింగ్ వాటర్ ఉండటంతో నీటి సమస్య తీరింది.

– శీలి శశిధర్, 4వ తరగతి, నగరం

వంట గ్యాస్ లీకుతో గృహం దగ్ధం

రూ.2 లక్షల ఆస్తి నష్టం

కర్లపాలెం: మండల పరిధిలోని పేరలి పంచాయతీ మల్లెలవారిపాలెం గ్రామంలో వంట గ్యాస్ లీకై రేకుల గృహం దగ్ధమైంది. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనలో రూ.2 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. పేరలి వీఆర్వో శివారెడ్డి వివరాల మేరకు.. మల్లెలవారిపాలెం గ్రామానికి చెందిన మల్లెల సత్యంబాబు భార్య విజయకుమారి వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు ఎగసి రేకుల గృహం దగ్ధమైందని తెలిపారు. ఈ ప్రమాదంలో గృహోపకరణాలు దగ్ధమవ్వటంతో సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు వీఆర్వో తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

అమృతలూరు(భట్టిప్రోలు):అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన వృద్ధురాలికి అమృతలూరు సర్పంచ్ దేవరకొండ రాము ఆపన్న హస్తం అందించారు. అమృతలూరు ఉత్తర దళిత వాడలో నివసిస్తున్న నన్నెపాగ లక్ష్మికి చెందిన పూరిల్లు ఇటీవల అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో ఇంట్లోని సమస్తం బుగ్గిపాలయ్యాయి. గ్రామ సర్పంచ్ దేవరకొండ రాము ఆదివారం రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని లక్ష్మికి స్థానిక చర్చిలో అందజేశారు.

పోస్టల్ బ్యాలెట్ వివరాలు అందజేయాలి

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు, తూర్పు నియోజకవర్గం(95) పరిధిలో ఎన్నికల ప్రక్రియలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, ఉద్యోగేతరులు (వీడియోగ్రాఫర్స్, డ్రైవర్లు మొదలుగువారు) వారి ఓటు ఏ నియోజకవర్గంలో ఉన్నప్పటికీ, ఈ నెల 26వ తేదీలోపు నగరపాలక సంస్థ పోస్టల్ బ్యాలెట్ హెల్ప్‌డెస్క్‌లో ఫారం–12 సంబంధించిన వివరాలు అందించాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ) కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధులకు ఎంపికైన ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వివరాలు తొలుత ఈ నెల 22వ తేదీ లోపు ఇవ్వాలని ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు ఇచ్చిందని, ప్రస్తుతం 26వ తేదీ వరకు గడువు పొడిగించిందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో విధులకు ఎంపికైన ప్రభుత్వ ఉద్యోగులు, ఉద్యోగేతరులు వారి ఓటు ఎక్కడ ఉన్నప్పటికీనీ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుని సమర్పించవచ్చాన్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ఈ నెల 26వ తేదీ లోగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ హెల్ప్ డెస్క్‌లో ఫారం–12(2 కాపీలు) అందించాలని తెలిపారు. ఫారం–12తో పాటుగా ఓటర్ ఎపిక్ కార్డ్ కాపీ, డ్యూటీ ఆర్డర్ కాపీ తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. హెల్ప్ డెస్క్ సిబ్బంది కార్యాలయ పని వేళల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధుల్లో ఉంటారన్నారు.

23న ఉచిత పుస్తక పంపిణీ

నగరంపాలెం: ఈనెల 23వ తేదీన ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా ఉచిత పుస్తక పంపిణీ చేయనున్నట్లు అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయం నిర్వాహకులు లంకా సూర్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బృందావన్‌గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయం ధార్మిక విజ్ఞాన ప్రాంగణం ఆవరణలో మంగళవారం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉచిత పుస్తక పంపిణీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దేవస్థానం పాలక మండలి అధ్యక్షుడు చిటిపోతు మస్తానయ్య, భారత ధార్మిక విజ్ఞాన పరిషత్ వ్యవస్థాపకుడు బొల్లేపల్లి సత్యనారాయణలు హాజరై, ప్రారంభించనున్నారని చెప్పారు. పాఠకులు, పుస్తక ప్రియులు తమ వద్దనున్న పుస్తకాలు ఇతరులు చదివేందుకు ఈ పుస్తక పంపిణీలో అందించి, వారికి కావాల్సిన పుస్తకాలను ఉచితంగా స్వీకరించాలని లంకా సూర్యనారాయణ తెలిపారు.

జగనన్నతోనే బంగారు బాపట్ల సాకారం

- జనరంజకంగా సాగిన ఐదేళ్ల పాలన
- మేనిఫెస్టో కోసం ప్రజల ఎదురు చూపులు
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోన రఘుపతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: బాపట్లను బంగారు బాపట్లగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి కోన రఘుపతి కోరారు. బాపట్లను జిల్లా కేంద్రంగా చేయటంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మెడికల్ కళాశాలను మంజూరు చేసిన జగనన్న రుణం తీర్చుకునేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోన సూచించారు. వైఎస్సార్ సీపీ సంక్షేమ పాలనకు ప్రజాదరణ ఏవిధంగా ఉందో తెలుసుకోడానికి నామినేషన్లుకు తరలి వచ్చిన అశేష జనమే నిదర్శనమని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో కోన రఘుపతి మాట్లాడారు. కరోనా వంటి క్లిష్టమైన పరిస్థితుల్లో సైతం ప్రజలను కంటికి రెప్పలా కాపాడిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని చెప్పారు. కుటుంబ సభ్యులు సైతం కరోనా సమయంలో వ్యాధిగ్రస్తుల వద్దకు రావటానికి భయపడితే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది దగ్గర ఉండి ధైర్యాన్ని నింపారని గుర్తు చేశారు. అమ్మ ఒడి, నాడు–నేడుతో విద్యార్థులకు మేలు జరిగిందన్నారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టే మ్యానిఫెస్టో కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని కోన రఘుపతి పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన మ్యానిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి పూర్తిగా ప్రజలకు అందించారని తెలిపారు. ఇప్పుడు కూడా ప్రజారంజక పాలన అందించేందుకు మ్యేనిఫెస్టో రాబోతుందని తెలిపారు. చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్‌ను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, ఉయ్యూరు లీలా శ్రీనివాసరెడ్డి, నర్రావుల ఏడుకొండలు, మార్కెట్‌యార్డు చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, జోగి రాజా, చింతల రాజశేఖర్, మండే విజయ్‌కుమార్, పేరాల సురేష్, మోర్ల సముద్రాలగౌడ్, పీటా బాబు, నర్రావుల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి సంస్కృత భాషా ప్రవేశ తరగతులు

భట్టిప్రోలు: తెనాలి గంగానమ్మ పేటలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో ఈ నెల 25 నుంచి సంస్కృత భాషా ప్రవేశ ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు కేఎల్ఎన్ సంస్కృత కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం (తెనాలి) ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. శ్రీ వైఖానస సేవా సంఘం సౌజన్యంతో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ప్రతి రోజూ సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం సూరేపల్లి వీపీ అండ్ జీఎస్ఎం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కూచిబొట్ల శ్రీనివాస శర్మ తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. మొదటి రోజు శిక్షణా తరగతులను గుంటూరు హిందూ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్ దీక్షితులు, దేవాలయ కార్యనిర్వహణాధికారి ఎస్‌వీఎస్ మల్లేశ్వరి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. సంస్కృత భాషపై మక్కువ కల్గిన వారు ఈ శిక్షణా తరగతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 92464 40720, 94407 06311 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఈవూరి నామినేషన్‌కు తరలిరండి

నేడు నామపత్రాలు సమర్పించనున్న డాక్టర్ గణేష్

చెరుకుపల్లి: రేపల్లె నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ ఈవూరి గణేష్ ఈ నెల 22వ తేదీ సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారని కార్యక్రమానికి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని వైఎస్సార్ సీపీ మండల పార్టీ కన్వీనర్ షైనం ఏడుకొండల రెడ్డి ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 6.30 గంటలకు డాక్టర్ ఈవూరి గణేష్ కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు కార్యకర్తలతో గుళ్ళపల్లి గ్రామంలోని ఆనందీశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం 7 గంటలకు మండల పార్టీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా రేపల్లె పార్టీ కార్యాలయానికి చేరుకుంటారని తెలిపారు. అక్కడ రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, బౌడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావుతో పాటు నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, నాయకులు, కార్యకర్తలతో కలసి ఆర్డీవో కార్యాలయానికి చేరుకుంటారని చెప్పారు. 10.30 గంటలకు నామినేషన్ దాఖలు చేస్తారని తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చెయ్యాలని ఏడుకొండల రెడ్డి కోరారు.

జగనన్నతోనే పేదల అభ్యున్నతి



యాజలి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కోన వెంకట్, వైఎస్సార్ సీపీ నాయకులు

కర్లపాలెం: పేద ప్రజల అభ్యున్నతి జగనన్న తోనే సాధ్యమని ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్ అన్నారు.వె వైఎస్సార్ సీపీ అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులు కోన రఘుపతి, నందిగం సురేష్‌ల తరపున ఆదివారం యాజలి గ్రామంలో కోన వెంకట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ గతంలో ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలను పక్కాగా అమలు చేసేందుకు గ్రామాలలో వలంటీర్ల వ్యవస్థ, గ్రామ సచివాలయ వ్యవస్థలు ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు వలంటీర్ల ద్వారా అర్హులను గుర్తించి సంక్షేమ పథకాలను అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. ఎన్నికల హామీలను 99 శాతం అమలు చేసిన జగనన్నకు ఓటు వేసి మళ్లీ ముఖ్యమంత్రిని చేయటం ద్వారా సంక్షేమ పథకాలతో పేదల బతుకులు మెరుగు పడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాదెండ్ల భానుప్రసాద్, వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఎంపీపీ యారం వనజ, వైఎస్సార్ సీపీ నాయకులు ఆట్ల నాగేశ్వరరెడ్డి, చిక్కాల సాగర్, పేరాల వెంకట సురేష్, పి.నాగార్జునరెడ్డి, యారం ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

నాక్ ఏ ప్లస్ ర్యాంక్ సాధనే లక్ష్యం కావాలి

వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్

ఏఎన్‌యూ: న్యాక్ (నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిడేషన్ కౌన్సిల్) పర్యటన నేపథ్యంలో యూనివర్సిటీలోని అన్ని విభాగాలు సిద్ధంగా ఉండాలని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ సూచించారు. యూనివర్సిటీ అధ్యాపకులు, సిబ్బందితో ఆదివారం వీసీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో వీసీ మాట్లాడుతూ ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు నాక్ సభ్యుల బృందం ఏఎన్‌యూలో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని వర్గాలు సంసిద్ధంగా ఉండాలన్నారు. నాక్ పర్యటన కోసం ఇప్పటివరకు విభాగాలు సహకరించిన తీరు అభినందనీయమన్నారు. ఆయా విభాగాలు సాధించిన ప్రగతిని క్షేత్రస్థాయిలో సమగ్రంగా వివరించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రతి విభాగం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆ విభాగం వివరాలను కమిటీ సభ్యులకు సూచించాలని తెలిపారు. అనంతరం విభాగాల్లో ఉన్న లేబరేటరీలు, స్మార్ట్ క్లాస్ రూమ్‌లను చూపాలన్నారు. విభాగాలు, పరిశోధన అధ్యయన కేంద్రాలు, రీసెర్చ్ సెంటర్లు, నాన్ టీచింగ్ సెక్షన్లు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. గత న్యాక్ పర్యటన నుంచి నేటి వరకు జరిగిన విభాగాల పనితీరు, సాధించిన ర్యాంకులు, పొందిన అవార్డులు, విభాగం ప్రగతి, పురోగతి వంటి అన్ని విషయాలను సిద్ధం చేయాలని సూచించారు. నాక్ ఏ ప్లస్ ర్యాంక్ సాధనే లక్ష్యంగా అందరూ కృషి చేయాలన్నారు. అధ్యాపకులు, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులందరూ అంకితభావంతో తమతమ బాధ్యతలు నిర్వహించాలన్నారు. ఐక్యూఏసీకి పంపిన సమాచారాన్ని సిద్ధంగా ఉంచాలని, ఉన్నది ఉన్నట్టు చెప్పాలని సూచించారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి మాట్లాడుతూ వర్సిటీకి ఉన్నత ర్యాంక్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ కీర్తి ప్రతిష్ఠ పెంచేందుకు నాక్ గ్రేడ్ దోహదపడుతుందన్నారు. ప్రిన్సిపాల్స్ ఆచార్య సీహెచ్ స్వరూపారాణి, ఆచార్య సిద్దయ్య, ఆచార్య శ్రీనివాసరెడ్డిలు వారి కళాశాలల్లో అన్ని విభాగాలు నాక్ పర్యటనకు సిద్ధంగా ఉన్నాయని ఉన్నతాధికారులకు తెలిపారు. ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ ఆచార్య సంధ్యకోల్, అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ గోపికృష్ణ, డైరెక్టర్లు, విభాగాధిపతులు, కో–ఆర్డినేటర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింట్ అయిన పులివర్తి శ్రీనివాస్ S/o. వెంకట కృష్ణారావు, అమృతలూరు, అమృతలూరు మండలం, గుంటూరు జిల్లా వారి నుండి సంతాయిషీ పొంది, ఇందు మూలంగా తెలియజేయునది ఏమనగా.

నా క్లయింట్ HMOP. 235/2023 తెనాలి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఫైల్ చేసిన తదుపరి కోర్టు వారు. ఈ HMOP కి, ప్రతివాది పులివర్తి అనితకి నోటీస్ పంపించు అవకాశం ఇచ్చిన తదుపరి ఈ HMOP లో వాది ఆరుసార్లు నోటీసు ప్రతివాదికి పంపినప్పటికీ, వారు నోటీసును తీసుకొనకుండా ఉండుట వలన, ఈ కేసులోని వాది పబ్లికేషన్ కొరకు పిటీషన్ ఫైలు చేయగా ఆ పిటీషన్‌ను గౌరవ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్, తెనాలి వారు పబ్లికేషన్‌కు అనుమతించిన తదుపరి బాపట్ల మరియు నెల్లూరు సాక్షి పేపర్‌లో పబ్లికేషన్‌కు వాది, సమాచారం ఇవ్వడం జరిగినది. ఈ పబ్లికేషన్ ద్వారా ప్రతివాది నోటీసును తీసుకొంటారని భావిస్తున్నాము.

ఇట్లు: A.Ramakrishna
Advocate, Chirala.

పోస్ట్ ఛారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం

కుంచవరంలో వివిధ నిర్మాణాల ప్రారంభంలో ప్రముఖులు



మానవత ప్రాంగణం ప్రారంభోత్సవంలో అతిథులు

కుంచవరం(తెనాలి): సేవే పరమావధిగా భావిస్తూ స్వచ్ఛంద సేవను నిత్యం ఆచరిస్తున్న పోస్ట్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రాంగణాన్ని నిర్మించడం అభినందనీయమని మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, పలువురు ప్రముఖులు ప్రశంసించారు. 'పోస్ట్' సంస్థ ఆధ్వర్యంలో తెనాలి సమీపంలోని కొల్లిపర మండల గ్రామం కుంచవరంలో విశాలమైన ప్రాంగణంలో నిర్మించిన గోశాల, వృద్ధాశ్రమం, మహిళా సాధికారిక కేంద్రం, కాంపిటీటివ్ లైబ్రరీ హాలు, మానవత ప్రాంగణం ప్రారంభోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. నూతనంగా చేపట్టనున్న నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. సంస్థ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దేవతామూర్తుల విగ్రహాలను అతిథులు ఆవిష్కరించారు. సర్వమత ప్రార్థనల అనంతరం మానవత సంస్థ ప్రాంగణాన్ని వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి, తెనాలి రీజినల్ ఛైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, తెనాలి ఛైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ ప్రారంభించారు. ట్రస్ట్ నిర్వాహకులు తన్నీరు శ్రీనివాసబాబు, నాగమల్లేశ్వరిదేవి దంపతులను అభినందించారు. పోస్టల్ శాఖలో ఉద్యోగ విరమణ చేసిన శ్రీనివాసబాబు దంపతులు పోస్ట్ సంస్థతో ఎన్నో ఏళ్లుగా మహిళా బ్యాంక్, మహిళా సాధికారత, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను నిర్వహిస్తూ ఎందరికో ఉపాధిని కల్పిస్తుండటం గొప్ప విషయమన్నారు. 'మానవత' కార్యదర్శిగా కుంచవరంలోని ట్రస్ట్ ప్రాంగణంలో ఆ సంస్థకో కేంద్రాన్ని నిర్మించి, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంగా తీర్చిదిద్దనున్నారని చెప్పారు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన శ్రీనివాసరావు దంపతులు సేవలు అనితరసాధ్యమని కొనియాడారు.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరీ



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురంలోని త్యాగరాజస్వామి కళా వేదికపై గాయత్రి మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో భక్త జ్ఞానానంద తీర్థ (ఓగిరాల వీరరాఘవశర్మ) జయంతి మహోత్సవాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. ఏపీ రాష్ట్ర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ డైరెక్టర్ మేరిగ విజయలక్ష్మి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. గాన కళాప్రవీణ డాక్టర్ దుడ్డు రాధిక (హైదరాబాద్) ఓగిరాల వారి రచనలు, వాగ్గేయకార కీర్తనలను శ్రావ్యంగా అలరించారు. వయోలిన్‌పై బీవీ దుర్గాభవాని, మృదంగంపై ఎన్ఎస్ కళ్యాణరామన్, ఘటంపై ఎం.హరిబాబు చక్కటి వాయిద్య సహకారాన్ని అందించారు. అనంతరం ఆమెకు భక్తజ్ఞానానంద తీర్థ మెమోరియల్ అవార్డు ప్రదానం చేసి సత్కరించారు. డాక్టర్ టి.చంద్రశేఖరరెడ్డి, ఎక్స్ చీఫ్ జియోలజిస్ట్ ఓ.ఎన్.జి.సి.ఓగిరాల రామకృష్ణ, సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ, ప్రధాన కార్యదర్శి ఎం.వై.శేషురాణి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.